
మద్యం దుకాణాలకు మరో 10 దరఖాస్తులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 94 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 55 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం వరకు 45 రాగా, బుధవారం మరో 10 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు కరీంనగర్ అర్బన్‌లో 5, రూరల్‌లో 35, తిమ్మాపూర్‌లో 7, హుజురాబాద్‌లో 3, జమ్మికుంటలో 5 వంతున దరఖాస్తు అందాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అవకాశం కల్పించింది.

నేడు 'స్థానిక' నోటిఫికేషన్

- రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- మొదటి విడతలో హుజురాబాద్ డివిజన్
- రెండో విడతలో కరీంనగర్ డివిజన్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

స్థానిక సంస్థల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ కానున్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై నడుస్తున్న కేసు విచారణ సందర్భంలో నామినేషన్లు స్వీకరించకుండా స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించడంతో షెడ్యూల్ ప్రకారమే గురువారం నోటిఫికేషన్ జారీ అవుతుందని సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిషన్ గతంలో ఇచ్చిన షెడ్యూల్, ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాటు చేసింది. జిల్లాలో 15 జడ్పీటీసీ స్థానాలు, 170 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

మొదటి విడతలో హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని శంకరపట్నం, వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజూరాబాద్, సైదాపూర్ మండలాల్లోని ఆరుజడ్పీటీసీ స్థానాలకు, 70 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

- ఈ నెల 9న నోటిఫికేషన్ జారీ కానున్నది. నోటిఫికేషన్ జారీ కాగానే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది.
- 11 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 12న నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 15 వరకు గడువు విధించారు.
- 23న పోలింగ్ జరుగుతుంది.
- నవంబరు 11న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

రెండో విడతలో కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం, చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లోని తొమ్మిది జడ్పీటీసీ స్థానాలకు, 100 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

- ఈనెల 13 నుంచి 15 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.
- నామినేషన్ల పరిశీలన ఈనెల 16న జరుగుతుంది.
- ఉపసంహరణకు ఈనెల 19 వరకు అవకాశం కల్పించారు.
- 27న ఎన్నికలు నిర్వహిస్తారు.
- నవంబరు 11న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.



సద్దుమణిగిన వివాదం

మంత్రులకు సర్ది చెప్పిన టీపీసీసీ అధ్యక్షుడు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మధ్య తలెత్తిన వివాదం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జోక్యంతో సద్దుమణిగింది. బుధవారం ఉదయం మంత్రులు పొన్నం, అడ్లూరిని తన నివాసానికి అల్పాహార విందుకు ఆహ్వానించి వివాదం గురించి చర్చించి సర్ది చెప్పారు. ఈ వివాదం ఇలాగే కొనసాగితే పార్టీ నష్టపోతుందని వారికి వివరించి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియానుద్దేశించి మాట్లాడటమే కాకుండా ప్రకటన విడుదల చేశారు. 'మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నాకు సోదరుడి వంటివారు. కాంగ్రెస్ పార్టీలో మాకు 30 ఏళ్లుగా రాజకీయాలకు మించిన స్నేహబంధం ఉన్నది. ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం ఎప్పుడు అలాగే కొనసాగింది. నేను ఆయనపై ఎటువంటి వాఖ్యలు చేయలేదు. అట్టడుగు స్థాయి నుంచి వ్యక్తిగా బీసీ వర్గానికి చెందిన నాయకుడిగా నాకు ఎవరిపైనా అలాంటి అభిప్రాయం ఉండదు. కొందరు రాజకీయ దురుద్దేశంతో నా వాఖ్యలను వక్రీకరించి వాస్తవానికి భిన్నంగా ప్రచారం చేశారు. దానితో ఏర్పడిన అపార్థాల వల్ల అన్నలాంటి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మనసు నొచ్చుకున్నదని తెలిసింది. ఆయన మనసు నొచ్చుకొని ఉంటే చింతిస్తున్నాను. మా ఇద్దరికి పార్టీ సంక్షేమం తప్ప ఎలాంటి దురుద్దేశం లేదు. నేను ఆయనను మాట అనకపోయినా ఆయన బాధపడిన దానికి క్షమాపణలు కోరుతున్నాను'.. అని ప్రకటించారు. వ్యక్తిగత అంశాలు పక్కన ఉంచి కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంలో చేస్తున్న పోరాటంలో కలిసి పనిచేస్తాం.. ఈ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని పొన్నం విజ్ఞప్తి చేశారు. దీంతో ఇద్దరు మంత్రుల మధ్య నెలకొన్న వ్యక్తిగత వివాదం సద్దుమణిగింది. లక్ష్మణ్ సామాజికవర్గానికి చెందిన వారు

• నొచ్చుకుంటే సారీ అన్న 'పొన్నం'

24 గంటల్లో పొన్నం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించడంతో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు బుధవారం అలాగే కొనసాగాయి. జిల్లా పోలీసు యంత్రాంగం మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి ఎదుట బారికేడ్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. తెలంగాణ చౌక్‌లో బందోబస్తు కొనసాగించారు. హుజూరాబాద్, సైదాపూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

• విభేదాలు తొలగేనా..?

ఉమ్మడి జిల్లాకు చెందిన మూడో మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు ఉన్న ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుకు మధ్య తీవ్ర విబేధాలు ఉండేవి. శ్రీధర్‌బాబు అనుచరుడిగా పేరున్న లక్ష్మణ్ కుమార్ మంత్రి పదవి వచ్చింది. దీంతో వారిద్దరిని ఒక గ్రూపుగా పొన్నం భావిస్తున్నట్లు ప్రచారం జరిగింది. మంత్రి శ్రీధర్‌బాబు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పెద్దపల్లి జిల్లాలోని మంథని, జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆయన నియోజకవర్గంలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు జిల్లాలో ఉన్నాయి. శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియోజకవర్గాలు ఈ జిల్లా పరిధిలో లేనందున పొన్నం ప్రభాకర్ జిల్లా మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న కాలంలో శ్రీధర్‌బాబు కరీంనగర్ నుంచి మంత్రిగా బాధ్యతలు నిర్వహించడం, సీనియర్ మంత్రిగా ఉండడంతో జిల్లా రాజకీయాల్లో ఆయనకు గట్టి పట్టు ఉంది. విస్తృత సంబంధాలు ఉన్నాయి. కరీంనగర్ నియోజకవర్గంలోని పలువురు ఆయన వద్దకు వెళ్లి పలు విషయాల్లో మద్దతు కోరుతున్నారు. ఆయన సూచించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి సుడా చైర్మన్ పదవి దక్కింది. శ్రీధర్‌బాబు ప్రమేయం లేకపోయినా జిల్లా గ్రంథాలయ సంస్థ పదవి సత్తు మల్లేశంకు దక్కింది. దీనిపై పొన్నం ప్రభాకర్ గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్

(మిగతా 8వ పేజీలో)

కలెక్టర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమాచార కమిషన్ సమాచార హక్కు చట్టం అమలు-2025 అవార్డులను ప్రకటించారు. బెస్ట్ పర్‌ఫార్మింగ్ జిల్లాగా కరీంనగర్ కలెక్టర్ అవార్డుకు ఎంపికయ్యారు. బెస్ట్ పర్ ఫార్మింగ్ అసిస్టెంట్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్‌గా కరీంనగర్ కార్పొరేషన్ డీసీపీ బషీర్ ఎంపికైనట్లు ప్రకటించారు.

ఈవీఎం గోదాం తనిఖీ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోని ఈవీఎం గోదాంను డీఆర్వో బి వెంకటేశ్వర్లు రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నా మన్నారు. ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

- అపరిశుభ్రంగా ఉన్న దుకాణాలపై కొరడా
- చికెన్ సెంటర్‌కు రూ. 20 వేల జరిమానా



చికెన్ సెంటర్ యజమాని నుంచి జరిమానా వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది

కరీంనగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రతపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనల ప్రకారం ఇళ్లు, దుకాణాలు, వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు, హాస్పిటల్స్, ఫంక్షన్ హాల్స్‌లోని చెత్తను బుట్టల్లో వేసి స్వచ్ఛ ఆటోలు, రిక్షాల్లో మాత్రమే వేయాలి. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలనేది నగరపాలక సంస్థ ఉద్దేశం. చెత్తను రోడ్లు, డ్రైనేజీలు, పరిసరాల్లో ఎక్కడ పడితే అక్కడ పడవేస్తే జరిమానా విధిస్తామని, చెత్తరహిత నగరంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ప్రజలకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఇళ్లు, దుకాణాల నుంచి చెత్త సేకరణతోపాటు చెత్తసమీకరణ ప్రాంతాల్లో చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలను సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఆరుబయట చెత్తను వేస్తే సీసీ కెమెరాల్లో గుర్తించి చెత్తవేసిన సదరు వ్యక్తికి జరిమానా విధిస్తున్నారు. అపరిశుభ్రంగా ఉండే దుకాణాలు, చికెన్‌సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ హౌస్‌లు, బేకరీలు, బార్లను తనిఖీ చేస్తూ చట్టపరంగా జరిమానా విధిస్తున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు ఎప్పటికప్పుడు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన పారిశుధ్య అధికారులు, సిబ్బంది జిల్లా జైలు గోడను ఆనుకొని ఉన్న పండ్ల దుకాణాలు, చికెన్ సెంటర్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. చికెన్ సెంటర్ యజమానికి 20 వేల జరిమానా విధించారు. అపరిశుభ్రంగా ఉన్న ఐదు పండ్ల దుకాణాల నిర్వాహకుల నుంచి మూడు వేల జరిమానా వసూలు చేశారు. నగరంలోని దుకాణాలతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దుకాణాల్లో చెత్త వేసేందుకు చెత్తబుట్టను వినియోగించి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని ఆదేశించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే జరిమానాతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. చెత్తరహిత నగరంగా, ఆరోగ్య నగరంగా మార్చుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి నగరపాలక సంస్థకు సహకరించాలని సూచించారు.

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి

• డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

శంకరపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంటరమణ అన్నారు. శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, ఔట్ పేషెంట్ రిజిస్టర్‌తోపాటు ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లీనిక్‌లో అసంక్రమిత వ్యాధుల రికార్డులో అధిక రక్త పోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమో దును పరిశీలించి వారికి మందులను అంద జేస్తున్న తీరును ఆరా తీశారు. ఔట్‌పేషెంట్లతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఫార్మసీ గదిలో సీజనల్ వ్యాధులకు సంబం ధించి మందులను పరిశీలిం చారు. ఆరోగ్య మ హిళ హెల్త్ క్యాంపు వివరాలు అడిగి తెల ుసు కున్నారు. ప్రసూతి గదిని పరిశీలించారు. డిప్యూటీ డీఎం హెచ్‌వో చందు మొలం గూర్ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సీ నేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రావణ్ కుమార్, శ్రావణి, వైద్య సి బ్బంది పాల్గొన్నారు.



క్లీనికల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ

• కరీంనగర్ రూరల్: మండలంలో చామనపల్లి పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో రీస్క్రినింగ్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎం హెచ్‌ఎన్ డాక్టర్ సనాజవేరియా, చామనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.



చామనపల్లి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ

ఆర్టీసీకి దసరా బొనాంజా

- కరీంనగర్ రీజియన్‌కు రూ.4.76 కోట్ల ఆదాయం
- 1,680 స్పెషల్ బస్సులతో ప్రయాణికులకు సేవలు

ఆర్టీసీ బస్సు కోసం ఆదర్శ పాఠశాల విద్యార్థుల అవస్థలు

- ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతున్న తల్లిదండ్రులు

'బుధవారం బోధన' కు ప్రాధాన్యం ఇవ్వాలి

• కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థి బుక్ ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధ వారం ఆమె సందర్శించారు. జడ్పీహెచ్‌స్‌లో బుధవారం బోధనలో బాగంగా పదో తరగతి విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థితో ఆంగ్ల పాఠాన్ని చదివించారు. విద్యార్థులుకు కష్టతరమైన పాఠ్యాంశాలపై బుధవారం బోధనలో దృష్టి పెట్టాలని, శ్రద్ధ అంకిత భావంతో నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లోని తరగతి గదులు, వంటగది, విటమిన్ గార్డెన్‌ను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగునూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని, పల్లె దవాఖానాను సందర్శించారు. కార్యక్రమలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, తహసీల్దార్ రాజేష్, ఎంఈవో రవీందర్ పాల్గొన్నారు.

'మద్దతు' దక్కేనా..?

- తేమ పేరుతో పత్తి ధరలో కోత
- దీపావళికి వరి కోతలు ప్రారంభం



హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో పండించిన పంటలకు మద్దతు ధర లభించేనా అని రైతులు ఎదురుచూ స్తున్నారు. గత సంవత్సరం పత్తి, వరికి మద్దతు ధర లభించకపోవ డంతో చాలా మంది రైతులు తక్కువ ధరలకు పంటలను అమ్ముకున్నారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలు రైతులకు అందుతాయో.. లేదో.. అని ఎదురు చూస్తున్నారు. వరి కోతలు దీపా వళికి ఊపందుకుంటాయి. ఇప్పటి వరకు కొనుగోళ్ల జాడ లేదు. ఇప్పుడిప్పుడే పత్తి ఏరడం ప్రారంభించారు. కొంత మంది రైతులు ముం దుగా పత్తి విత్తనాలు విత్త డంతో పంట చేతికొచ్చింది. ఈ పత్తిని జమ్మికుంట, వరంగల్ మార్కెట్‌కు తీసు కెళితే తేమ పేరుతో వ్యాపారులు తక్కువ ధరకు కొను గోలు చేస్తున్నారు. జమ్మికుంట మార్కెట్‌లో ఇప్పటి వరకు కొత్త పత్తికి క్వింటా ల్‌కు 6,800 రూపాయలు మించి లభించలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే దశలో భారీ వర్షాలు కురవడంతో పగిలిన పత్తి దెబ్బతిన్నది. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు అక్కడక్కడ కోతకు వచ్చిన పొలాలు నేల వాలాయి. డివిజన్‌లో హుజూ రాబాద్, జమ్మికుంట, ఇల్లంద కుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండ లాలు ఉన్నాయి. అందులో 1.20 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. 80 వేల ఎకరాల్లో వరి, 25వేల ఎకరాల్లో పత్తి, మిగితా 15వేల ఎకరాల్లో మొక్కజొన్న, ఇతర పంటలను సాగు చేశారు. ఈ ఏడాదైనా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందా అని ఎదురు చూస్తు న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేసి మద్దతు ధర కల్పించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పంట	ధర (క్వింటాల్‌కు)
వరి (గ్రేడ్ ఎ)	2,389
వరి (సాధారణ రకం)	2,369
పత్తి (పొడవు పింజ రకం)	8,110
పత్తి (మధ్య రకం)	7,710
మొక్కజొన్న	2,400
కందులు	8,000
మినుములు	7,800
పెసలు	8,768
వేరుశనగ (పల్లి)	7,263
పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్)	7,721
సజ్జలు	2,775
జొన్నలు (హైబ్రిడ్)	3,699
జొన్నలు (మలదండి)	3,749
నువ్వులు	9,846

అలంకారప్రాయంగా పల్లె దవాఖానాలు

- మూడేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం..
- పట్టించుకోని అధికారులు

తంగళ్లపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానల నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా నిలుస్తున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా 2022లో తంగళ్లపల్లి మండలంలో 7 పల్లె దవాఖానల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తంగళ్లపల్లి, నేరెళ్ల, లక్ష్మీపూర్, జిల్లెల్ల, తాడూరు, బస్వాపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో ఒక్కో పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.

నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు..

తాడూరు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవాఖాన నిర్మాణాలు పూర్తిచేసుకుని మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకరప్రాయంగా నిలిచాయి. లక్ష్మీపూర్, జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానల నిర్మాణం పూర్తి చేసుకుని ఆందుబాటులోకి వచ్చాయి. నేరెళ్ల, ఒబులాపూర్ గ్రామాల్లో బేస్‌మెంట్ దశలోనే నిర్మాణ పనులు నిలిచిపో యాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించ డానికి ప్రయత్నించగా అందుబాటు లోకి రాలేదు.



తాడూరులో నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె దవాఖాన

అద్దె ఇళ్లలోనే కొనసాగింపు..

మూడేళ్లుగా అద్దె ఇళ్లలోని ఇరుకు గదు ల్లో అరకొర వసతు లతో పల్లె దవాఖానాలు కొనసాగుతున్నాయి. మూడేళ్లుగా తాడురు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవఖానాలు నిర్మాణం పూర్తిచేసుకుని సిద్ధంగా ఉన్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో భవనాల నిర్మాణాల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో నిర్మాణం పూర్తయినా ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


తాడూరులో అద్దె ఇంట్లో పల్లె దవాఖాన

గత ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తి చేశాను..

- వెంకటరెడ్డి, కాంట్రాక్టర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం భవనం నిర్మాణం పూర్తిచేశాను. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మారాక పల్లె దవాఖాన నిర్మాణం బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాను. బిల్లులు త్వరగా చెల్లించి భవనం ప్రారంభించాలి. పల్లె దవాఖానల భవన నిర్మాణాల బిల్లులు చెల్లించేలా కలెక్టర్ చొరవ తీసుకుని పల్లె దవాఖానలు ప్రారంభించాలి.

పల్లె దవాఖానలు అందుబాటులోకి తేవాలి..

- తోట రాజు, తాడూరు



పల్లె దవాఖానలు త్వరగా అందుబాటులోకి తేవాలి. నిర్మాణం పూర్తి చేసుకుని మూడేళ్లు అవుతోంది. అధికారులను అడిగినా స్పందన లేదు. అద్దె ఇంట్లో ఇరుకు గదుల్లో పల్లె దవాఖాన కొనసాగుతోంది. నిర్మాణం పూర్తయినా ఎందుకు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలి.

వామన్‌రావు దంపతుల హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు-నాగమణి దంపతుల హత్యకేసు విచారణను సీబీఐ అధికారులు వేగవంతం చేస్తున్నారు. కేసు విచారణలో భాగంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా, మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణను, ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు బొల్లంపల్లి సంతోష్ గౌడ్‌ను రామగుండం కమిషరేట్‌లో ఉన్న సీబీఐ క్యాంపు ఆఫీసులో అధికారులు విచారించారు. ఈ ఇద్దరిని దాదాపు మూడు గంటల పాటు అధికారులు పలు అంశాలపై లోతుగా విచారించి వివరాలు సేకరించారు. వామన్‌రావుతో ఉన్న సంబంధాలపై ఆరాతీశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు సంబంధించిన రూ.9 వందల కోట్ల కేసు, ఇన్‌కంట్యాక్స్ కేసు తదితర అంశాలపై ఇనుముల సత్యనారాయణను అధికారులు ప్రశ్నించి వివరాలు సేకరించారు. మరికొందరిని సైతం సీబీఐ విచారించనున్నట్లు సమాచారం.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లోని సదాశివపల్లికి చెందిన సాయిని మహిపాల్ (34)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపల్లికి చెందిన మహిపాల్ అనే యువకుడికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం భార్యతో విడాకులు జరిగాయి. అప్పటి నుంచి ఒంటరిగా ఉండడమే కాకుండా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం

- అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై కనిపించిన పులి
- ఆనవాళ్లు వెతుకుతున్న ఫారెస్ట్ అధికారులు

గోదావరిఖని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలం బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో బసంత్‌నగర్ నుంచి అంతర్గాం వైపు వెళ్లే బుగ్గ రోడ్డుపై పెద్దపులి దర్జాగా నడుస్తూ బాటసారుల కంటపడింది. కొందరు ఫొటోలు, వీడియోలు తీశారు. బసంత్‌నగర్ గుట్ట, బుగ్గ ప్రాం తంలో వర్షాకాలం నేపథ్యంలో దట్టంగా అడవి పెరిగింది. రాజీవ్‌రహదారికి ఇవతలి వైపు ఎన్‌టీపీసీ వాటర్‌డ్యామ్ వెనుకాల కూడా వందల ఎకరాల్లో దట్టమైన చెట్లు ఉండడంతో ఎక్కడి నుంచో పులి ఈ ప్రాంతానికి వచ్చినట్టు తెలుస్తున్నది. అయితే నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారి, రైల్వేట్రాక్‌తో పాటు పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతంలో పులి సంచారం అనేది చాలా ఏళ్ల తరువాత కనిపించింది. బసంత్‌నగర్ నుంచి అంతర్గాంకు రాత్రి పగలు లేకుండా కార్లపై, బైక్‌లపై, సైకిళ్లపై రాకపోకలు సా గుతాయి. కొందరు పాదచారులు కూడా నడుస్తారు. బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, లంబాడి తండ, కుంద నపల్లి గ్రామాలకు సంబంధించిన పశువులు, పశువుల కాపర్లు, ప్రజలు వంటచెరకు కోసం వెళ్లేవారు రాత్రి,పగలు ఆ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటారు. ఎన్‌టీపీసీ యాష్‌పాండ్ చుట్టూ ఉన్న ప్రాంతమంతా వర్షాకాల నేపథ్యంలో దట్టమైన చెట్లపొదలతో నిండిపోయింది. లంబాడి తండా పూర్తిగా అడవిని ఆనుకునే ఉంటుంది. అయితే ఈ విషయం తెలుసు కున్న ఫారెస్టు అధికారులు పులి పాదచారులకు కనిపించిన బుగ్గరోడ్డులో బుధవారం రాత్రి పరిశీలించారు. రాత్రి వేళల్లో పులికి సంబంధించిన పాద ముద్రలేవి ఫారెస్ట్ అధికారులకు కనిపించలేదు. కానీ ప్రయాణికులు పులి రోడ్డుపై వెళుతుండగా తీసిన ఫొటోలు బుగ్గ రహదారివేనని ధ్రువీకరించారు.


అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై పెద్దపులి

అపస్మారక స్థితిలో వృద్ధదంపతులు

- చికిత్స పొందుతూ భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



అనుమానాస్పదంగా పడి ఉన్న గజ్జెల శంకరయ్య, లక్ష్మీ

గంగాధర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో అపస్మారక స్థితిలో ఇంటిలో పడిపోయిన వృద్ధదంపతులను చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జెల శంకరయ్య, లక్ష్మీ వృద్ధ దంపతులు. మంగళవారం రాత్రి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారని గ్రామస్థుల సమాచారంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు. శంకరయ్య పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మీ కోమాలోనే ఉండగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. శంకరయ్య మృతి పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పలు కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అయితే వీరికి సంతానం లేకపోవడం, గ్రామానికి చివరన ఇల్లు ఉంది. దీన్ని అవకాశంగా తీసుకున్న దుండగులు వారిపై మత్తు మందు చల్లి వృద్ధురాలి మెడలోని బంగారం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెగడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగాని అజయ్‌కుమార్(26) బీటెక్ ఫెయిల్ కావడంతో మద్యానికి బానిసగా మారి జల్సాలకు అలవాటుపడ్డాడు. వ్యవసాయ పెట్టుబడి కోసం తెప్పిం చిన అప్పు, జల్సాలకు చేసిన అప్పులు అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయిన అజయ్ గత శనివారం పొలం వద్ద గడ్డి మందుతాగి, కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెంటనే చికిత్సకోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందు తూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు అజయ్‌కుమార్ తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


అజయ్ (ఫైల్)

చలాన్లపై పోలీసు శాఖ సీరియస్

- ఫైన్ కట్టకుంటే వాహనం సీజ్ ● 45 రోజులు దాటితే అంతే ● ఏటా రూ.3.85 కోట్ల జరిమానా

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చలాన్‌లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించారని ప్రతిరోజు దాదాపు 500 వాహనాలకు ఈ-చాలన్ రూపంలో ఫైన్ వేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఏటా రూ.3.85 కోట్ల ఈ-చలాన్స్ ద్వారా ఫైన్ విధిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల పరిధిలో ప్రతిరోజు పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ప్రతి శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా హెల్మెట్, రాంగ్ పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సీట్ బెల్టు, అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర నిబంధనలు పాటించని వాహనాలకు ఈ-చాలన్ రూపంలో జరిమానాలు విధిస్తున్నారు. జరిమానా విధించి 45రోజులైనా చెల్లించకుంటే వాహనాన్ని పట్టేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఒక్కో వాహనానికి ఐదు జరిమానాలు ఉండి రోడ్డుపై తిరిగితే పోలీసులు వెంటనే పట్టేస్తున్నారు. పెండింగ్ చలాన్‌ల జరిమానాలు వెంటనే చెల్లించకుంటే వాహనాన్ని సీజ్ చేస్తున్నారు.



● రూ.11.55 కోట్ల జరిమానా..

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా మూడు సంవత్సరాల్లో వాహనదారులు దాదాపు రూ.11.55 కోట్ల ఈ-చలాన్ జరిమానాలు విధించారు. ఇందులో కేవలం రూ.3.58 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా రూ.7.97కోట్లు ఈ-చలాన్స్ జరిమానాలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన దాదాపు రూ.7.97కోట్ల వాహనాలకు ఈ-చలాన్స్ ద్వారా జరిమానాలు విధించగా, 25 శాతం వాహనదారులు మాత్రమే చెల్లించారు. మిగతా వాహన యజమానులు రూ.7.97 కోట్లు జరిమానాలు చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఐదు చలాన్‌లు ఉంటే వెంటనే చెల్లించకుంటే వాహనం సీజ్ చేయడమే కాకుండా వాహనం క్రయవిక్రయాలు చేయకుండా చర్యలు చేపట్టారు. మరోవైపు వాహనదారుడి లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తున్నారు.

● జరిమానా చెల్లించాల్సిందే

- మహేష్ బి. గీతే



జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన ప్రతి ఒక్కరూ జరిమానా చెల్లించాలి. ట్రాఫిక్ చలాన్స్ జరిమానాలు చెల్లించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించాలి.

ఏసీబీకి చిక్కిన ముగ్గురి రిమాండ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఒక ఆసుపత్రి నిర్వాహకుడి వద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో కరీంనగర్ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ రెడ్డి, ప్రైవేట్ సహాయకుడు రాములను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు నిందితులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసులు అరెస్టు చేసిన డ్రగ్ కంట్రోల్ అధికారులు శ్రీనివాసులు, కార్తీక్ భరద్వాజ్‌రెడ్డి వద్ద బ్యాగ్‌లలో తనిఖీ చేయగా రూ.లక్షా 73 వేల నగదు పట్టుబడింది.

హైదరాబాద్, వరంగల్‌లోని ఈ ఇద్దరు అధికారుల ఇళ్లలో ఏసీబీ పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. బ్యాంక్ పాస్‌బుక్‌లు, లాకర్‌లు, ఇతర ఆస్తుల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బ్యాంక్ ఖాతాలు, లాకర్‌లను ఫ్రీజ్ చేసినట్లు, ఈ ఇద్దరు అధికారుల అవినీతిపై రెండు నెలల నుంచి ఏసీబీకి చాలా ఫిర్యాదులు అందినట్లు తెలిసింది.

శాంతినగర్‌లో కార్డన్ సెర్చ్

- ధ్రువీకరణ పత్రాలు లేని 105 వాహనాలు సీజ్



శాంతినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, వినాయకనగర్‌లో బుధవారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 77 ద్విచక్రవాహనాలు, 27 ఆటోలు, ఒక ట్రక్‌ను సీజ్ చేశారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్పరిణామాలపై వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, సంజీవ్, సదన్ కుమార్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్, నరేష్‌లు సోమవారం ద్విచక్ర వాహనంపై మండలంలోని లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గయ్యపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో పై ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


రాకేష్ (ఫైల్)

కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకుపోతుండగా బుధవారం స్థానికులు గుర్తించారు. మృతదేహం గుర్తు పట్టకుండా ఉన్నది. మృతదేహాన్ని ఎవరూ బయటకు తీయకపోవడంతో కాలువలోనే కొట్టుకుపోయింది. ఘటన వివరాలు తెలియాల్సి ఉన్నది.

మహిళా పోలీసులతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఇల్లందకుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో మహిళా పోలీసులచే బుధవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సేఫ్ హ్యాండ్స్ విత్ తెలంగాణ పోలీస్-నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్, లా అండ్ ఆర్డర్ విధుల్లో భాగంగా బ్లూకోల్ట్ విధులు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

వరికి దోమ కాటుతో రైతు విలవిల

- సన్న రకం వరికి దోమకాటు, కాటుక తెగులు ● డ్రోన్‌లతో పురుగు మందు పిచికారి ● రైతులకు పెరుగుతున్న ఖర్చులు

సైదాపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరి గొలుసు పూర్తిగా బయటకు వచ్చి గింజలు అయ్యే సమయంలో దోమకాటు, కాటుక తెగులు(నల్లి పురుగు) సోకుతోంది. దీంతో వరి నలుచుగా మారడం, గింజలు నల్లబడి తాలుగా మారుడం జరుగుతుంది. వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో నేల ఎండకుండా ఎప్పటికి తేమగా ఉండడంతో వరిలో దోమ, కాటుక తెగులు సోకుతుంది. ఎక్కువగా ఈ దోమ కాటు, కాటుక తెగులు సన్నరకం వరికే ఆశిస్తుంది. రైతులు సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తున్నదని చాలా మంది రైతులు సన్నరకం వరిపంటను సాగు చేశారు. ఈ సన్నరకం వరి మొదటి నుంచి పురుగు మందులు పిచికారి చేస్తేనే పంట దిగుబడి వస్తుంది. మొదట పొట్ట దశకు రాకముందు ఘనే పురుగుకు ఆశించకుండా పురుగుమందులు పిచికారి చేశారు. ఇప్పుడు దోమ కాటుతో పాటు, నల్లి పురుగు ఆశిస్తున్నదని రైతులు వాపోతున్నారు. పురుగు మందుల పిచికారితో పెట్టుబడి పెరిగిపోతున్నదని రైతులు తెలుపుతున్నారు. రైతులు డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. డ్రోన్లతో పురుగు మందుల పిచికారికి ఎకరాకు రూ. 500లు తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, పొలాలు ఆరడం లేదని, పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలంలో సమారు 19వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. అందులో సుమారు 8వేల ఎకరాల సన్న రకం, సుమారు 11వేల ఎకరాల దొడ్డు రకం వరి సాగు చేశారు. దొడ్డు రకాలకు తక్కువగా చీడ పీడలు ఆశిస్తున్నాయి. సన్నరకం వరికి ఎక్కువగా చీడపీడలు ఆశిస్తున్నాయని రైతులు తెలపుతున్నారు. పంట చేతికి వచ్చేవరకు నమ్మకం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.


జాగీర్‌పల్లిలో దోమ కాటుకు గురైన వరి


డ్రోన్‌తో పురుగు మందు పిచికారి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వైదేహి, సైదాపూర్ వ్యవసాయాధికారి



వానాకాలం సీజన్‌లో గింజ గట్టిపడే దశలో వరికి వచ్చే సుడి దోమ, కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి. గింజ గట్టిపడే దశలో కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు టెబ్యుకొనజోల్ , ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 200మి,లీ ఎకరానికి పిచ్చికారి చేయాలి. సుడిదోమ రాకుండా ఉండేందుకు రైతులు పొలాన్ని ఆరబెట్టాలి. డైనోటెఫ్యూరాన్ 80గ్రా, లేదా పైమెట్రోజైన్ 120గ్రా మొక్కలు మొదళ్ల తడిచేలా చూడాలి.

వీధి కుక్కల పట్టివేత

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో కొన్ని నెలల నుంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కుక్కలను మున్సిపాలిటీ వారు పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. వీటికి శాశ్వత పరిష్కారంగా చర్యలు చేపట్టాలని, వాటికి కూడా ప్రభుత్వభూమిలో షెడ్డులు ఏర్పాటు చేసి, జీవించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు కోరుతున్నారు.


వీధి కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

ఆర్టీసీ బస్సు కోసం ఆదర్శ పాఠశాల విద్యార్థుల అవస్థలు

● ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతున్న తల్లిదండ్రులు



పోచంపల్లిలో ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి పోచంపల్లిలో ఆదర్శ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులు తమతమ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు మీదికి వచ్చి గంటల తరబడి వేచి చూస్తుంటారు. జమ్మికుంట నుంచి కరీంనగర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు అక్కడి నుంచి ప్రయాణికులతో రద్దీగా వస్తుండడంతో ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో విద్యార్థులు గంటల తరబడి రోడ్డుపై బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇళ్లలోకి చేరుకొనే సరికి రాత్రి ఏడు గంటల నుంచి 8గంటల సమయం పడుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెంజర్లకు చెందిన ఇద్దరు విద్యార్థులు బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ బస్సు టైరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. సమస్యపై కలెక్టర్‌తో పాటు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించినా సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదర్శ పాఠశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం



- 'ఎన్ఎంఎంఎస్' ద్వారా ఏడాదికి రూ.12వేలు మంజూరు
- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- 9 నుంచి ఇంటర్ వరకు అందనున్న కేంద్ర సాయం
- ఈనెల 14 వరకు దరఖాస్తుకు గడువు
- నవంబరు 23న ప్రతిభ పరీక్ష

వెల్గటూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రభుత్వం 2008లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జాతీయ ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు కేంద్ర ప్రభుత్వం అందించనున్నది. ఈ నగదు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. పదో తరగతి తరువాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఉపకార వేతనం కోసం వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా గత ఏడాది జగిత్యాల జిల్లా నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 72 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఏడాదిలో సంఖ్యను పెంచేందుకు నవంబర్‌లో జరగనున్న పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల చదువులు మధ్యలో ఆపేయకుండా జాతీయ ఉపకార వేతనాలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

● అర్హతలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువు తున్న విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మార్కులు సడలింపు ఉంటుంది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించి ఉండకూడదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫాంతో పాటు 7వతరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, స్టడీ, ఆదాయ, కుల ధ్రువీకరణ జిరాక్స్ ప్రతులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

● పరీక్ష విధానం

ఎన్ఎంఎంఎస్ పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో మానసిక సామర్థ్య పరీక్షకు సంబంధించి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. రెండవ విభాగంలో 7,8 తరగతుల సిలబస్ నుంచి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. దీనిలో గణితం నుంచి 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవశాస్త్రం నుండి 35 మార్కులు, సాంఘికశాస్త్రం నుండి 35 మార్కులు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి
-ప్రభాకర్, వెల్గటూర్ ఎంఈవో



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నాలుగేళ్ల పాటు అందించనున్న ఉపకార వేతనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందనున్నాయి. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుంది. విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్ష రాసేందుకు సన్నద్ధమవ్వాలి.

ఆర్టీసీకి దసరా బొనాంజా

● కరీంనగర్ రీజియన్‌కు రూ.4.8 కోట్ల ఆదాయం ● 1,680 స్పెషల్ బస్సులతో ప్రయాణికులకు సేవలు

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు ఆర్టీసీకి లాభాలను తెచ్చిపెట్టాయి. పండుగల సందర్భంగా ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడిపించింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో రెగ్యులర్ సర్వీసులతోపాటు 1,680 స్పెషల్ బస్సులతో గత నెల 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ప్రయాణికులకు సేవలందించింది. కరీంనగర్ రీజియన్‌లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిళల నుంచి 2,75,75,749 రూపాయల ఆదాయం సమకూరినట్లు రీజినల్ మేనేజర్ ప్రకటించారు. స్పెషల్ బస్సుల ద్వారా మహాలక్ష్మి పథకంతో కలిపి 4,80,01,642 రూపాయల ఆదాయం సమకూరింది. మొత్తం 10 రోజుల్లో మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణికులతో కలిపి 4,63,119 మంది వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. గోదావరిఖని డిపో 260 స్పెషల్ బస్సులను నడిపించగా 73,78,376 రూపాయల ఆదాయం వచ్చింది. హుస్నాబాద్ నుంచి 100 బస్సులను నడిపించగా 28,37,837, హుజురాబాద్ డిపోకు చెందిన 110 బస్సులకు 31,21,621, కరీంనగర్-1 డిపో నుంచి 170 బస్సులను నడిపించగా 48,24,323 రూపాయల ఆదాయం వచ్చింది. కరీంనగర్-2 డిపో 270 బస్సులకు 76,62,160, మంథని డిపో నుంచి 120 బస్సులకు 35,87,338, జగిత్యాల డిపో 140 బస్సులకు



40,73,725, కోరుట్ల డిపో 120 బస్సుల ద్వారా 34,05,404 రూపాయల ఆదాయం వచ్చింది. మెట్‌పల్లి డిపోకు చెందిన 140 బస్సుల ద్వారా 39,72,972, సిరిసిల్ల డిపోకు 130 బస్సుల ద్వారా 36,89,188, వేములవాడ డిపోకు 120 బస్సుల ద్వారా 34,48,698 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. 16 గేట్లు పైకి ఎత్తి 49,984 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 59,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 59,774 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు బుధవారం 2200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద కాలువ ఇన్‌లెట్స్‌తో పాటు ములవాగు ద్వారా2200 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దిగువకు ఒక గేట్ ద్వారా 1500 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు . ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకుగాను 27.145 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సీసీ టీవి ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ప్రారంభం కానున్న శిక్షణ 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల 18 నుంచి 45 సంవత్సరలలోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్. 9502593347, 9849411002 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కె సౌమ్య, పి కాశీవిశ్వనాథ్ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి విద్యార్థులను, పీడీని అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 55మంది రైతులు 392క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ చిరునామా

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



లక్కీడ్రాలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) చిరునామాగా నిలుస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో దసరా స్పెషల్ లక్కీ డ్రా విజేతలకు బహుమతులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారన్నారు. డిప్యూటీ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, కరీంనగర్ ఒకటి, రెండో డిపో మేనేజర్లు వి. విజయ మాధురి, ఎం.శ్రీనివాస్, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.మల్లేశం, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలు

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల బస్సుల్లో ప్రయాణించిన వారిల్లో మొదటి బహుమతి రూ.25,000ను ఈ.రమేశ్ (కరీంనగర్), రెండో బహుమతి రూ.15,000 వి.సదానందం (గోదావరిఖని), మూడో బహుమతి రూ.10,000 కె.నాగరాజు (జగిత్యాల) దక్కించుకున్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఒకరి మృతి



ప్రమాదస్థలంలో హార్వెస్టర్

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ హార్వెస్టర్ కరీంనగర్ వైపు నుంచి హైదారాబాద్ వైపునకు వెళతుండగా వెనుక నుంచి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్‌పై ఉన్న హెల్పర్ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల సాగర్ (28) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్ పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన గుండ్రాతి సంతోష్ గాయపడ్డాడు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఆస్పత్రికి తరలించిన పోలీసులు

వేములవాడ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. సాయినగర్‌లోని ఓ ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటన తెలుసుకున్న నైట్ పెట్రోలింగ్ పోలీసులు గాయాలతో కింద పడిన వ్యక్తిని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పుష్పయాగం.. ఏకాంత సేవ



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు



ఏకాంత సేవలో స్వామివారు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను దేవాదాయ - ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం పట్టణ పురవీధుల గుండా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చాడు. రాత్రి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణాధికారి మారుతిరావు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరి సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని కరీంనగర్ ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయ సమావేశ మందిరంలోటీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇరిగేషన్ శాఖ మహిళాలకు జిల్లా స్థాయిలో బహుమతులు రావడంతో వారికి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈఎన్‌సీ మధుసూదన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు తీరుతున్నాయని, పర్మినెంట్ ప్రమోషన్లు వస్తున్నాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారన్నారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. బతుకమ్మ వేడుకల్లో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన మహిళా ఉద్యోగులను మదుసూదన్‌రావు అభినందించారు. తెలంగాణ వచ్చిన తరువాత బతుకమ్మ పండగ పల్లెటూళ్ల నుంచి పట్నాలకు అక్కడి నుంచి దేశ విదేశాలకు పాకిందని అన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ రాష్ట్రానికి గుండెకాయలాంటిందని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులను ప్రభుత్వం ఇవ్వలేకపోవడం చాలా బాధకారం అన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఈఎన్‌సి సురేందర్‌రెడ్డి, ఎస్ఈలు సుమతి దేవి, శ్రీనివాస్ గుప్త, ఈఈ జగన్, జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి శ్రీనివాస్, హర్మిందర్ సింగ్, గూడ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మన్నె సరిత, జిల్లా నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న ఈఎన్సీ మధుసుదన్‌రావు

ముగిసిన రీజినల్ ఫారెస్టు క్రీడలు

- పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా సిద్దిపేట జోన్



పోటీల విజేతలకు పతకాల ప్రదానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బుధవారం రాత్రి ముగిశాయి. అన్ని క్రీడల్లో అధిక పాయింట్లు సాధించిన సిద్దిపేట జిల్లా జోన్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో రాజన్న జోన్‌లోని కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, రాజన్న సిరిసిల్ల నుంచి 400 క్రీడాకారులు హాజర య్యారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టగ్గాఫ్ వార్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు సమావేశంలో కరీంనగర్ డీఎఫ్‌వో బాలమణి, కామారెడ్డి డీఎఫ్‌వో బోగాని నిఖిత, మెదక్ డీఎఫ్‌వో జోజి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల డీఎఫ్‌వోలు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతను కలిగించాయన్నారు. పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులు వచ్చేనెలలో జరుగనున్న రాష్ట్రస్థాయి అటవీశాఖ ఉద్యోగుల క్రీడలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలి

● దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు, వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలని సహాయ కమిషనర్ నాయిని సుప్రియ అన్నారు. బుధవారం ఏసీ కార్యాలయంలో ఈఓలు, మేనేజర్లు, ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆలయాల నుంచి శాఖకు బకాయిలు చెల్లించాలని, ఆడిట్ లెక్కలు పూర్తి చేయాలని అన్నారు. ఆలయ భూముల రిజిస్ట్రేషన్ చేసి జీపీఎస్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. నూతనంగా రిజిస్ట్రేషన్ అయిన దేవాలయాల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. కొత్త ఈవోలు పాత ఈవోల నుంచి బంగారు, వెండి ఆభరణాలను, వాటి లెక్కలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆలయాలకు సంబంధించి కోర్టులో కేసులుంటే కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్లు నెలవారి ఆలయాల సందర్శన రిపోర్ట్‌ను సమర్పించాలని, ఏసీ కార్యాలయంలో ఆయా ఆలయాలకు చెందిన ఏమైనా పెండింగ్ పనులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సుప్రియ

● ఇంటర్వ్యూ

రెగ్యులర్‌గా చదవలేనివారికి

దూర విద్య వరం

డాక్టర్ వంగల శ్రీనివాస్, కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి



గణేశ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): రెగ్యులర్‌గా చదవలేని విద్యార్థులకు దూరవిద్య వరమని డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ వంగల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యను ఇంటి నుంచి అభ్యసించాలనుకునేవారు ఈ నెల 10వ తేదీలోగా ప్రవేశం పొందాలన్నారు.

ఆంధ్రజ్యోతి: మన సెంటర్‌లో ఏ కోర్సులు ఉన్నాయి?

సమన్వయ అధికారి: బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బీజెడ్‌సీ, బీఎల్ ఐఎస్‌సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, గణితశాస్త్రం, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: డిగ్రీ, పీజీ, బీఎల్‌ఐఎస్‌సీల్లో ఎలా ప్రవేశం పొందాలి?

సమన్వయ అధికారి: మొదట డిజీ లాకర్ యాప్ ద్వారా ఏబీసీ ఐడీ, డీఈబీ ఐడీని ఆన్‌లైన్ ద్వారా పొందాలి. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫారంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం ఎంచుకున్న అధ్యయన కేంద్రాల్లో సమర్పించాలి. రుసుం చెల్లించినప్పుడే అడ్మిషన్ ఖరారు అవుతుంది.

ఆంధ్రజ్యోతి: రెగ్యులర్ డిగ్రీతో సమానంగా పరిగణిస్తారా?

సమన్వయ అధికారి: కచ్చితంగా పరిగణిస్తారు.

ఆంధ్ర జ్యోతి: విశ్వవిద్యాలయంలో ఉచితంగా చదివే అవకాశాన్ని ఎవరికైనా కల్పిస్తున్నారా?

సమన్వయ అధికారి: సమతా సపోర్టు స్కీం కింద కొల్లం, కోయ, కొండ రెడ్డి, గోండు, మొదలగు ఆదిమ గిరిజనులు నామమాత్రపు రుసుము రూ.500తో డిగ్రీ పూర్తి చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాం.

రేషన్ దుకాణాలకు చేరని బియ్యం

- లబ్ధిదారుల ప్రదక్షిణలు
- గోదాము వద్ద డీలర్ల పడిగాపులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): రేషన్ దుకాణాలకు సరిపడా బియ్యం సరఫరా చేయక పోవడంతో లబ్ధిదారులు, డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తారు. కరీంనగర్ రూరల్ మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటి వరకు సరిపడా రేషన్ బియ్యం రాకపోవడంతో దుకాణాలు మూసివేసి కనిపిస్తున్నాయి. దీంతో బియ్యం కోసం లబ్ధిదారులు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటి వరకు సగం కూడా రేషన్



బియ్యం లేక మూసివేసిన రేషన్ షాపు

దుకాణాలకు రేషన్ బియ్యం రాలేదని డీలర్లు వాపోతున్నారు. ఇప్పటికే ఎలబోతారం, వల్లంపహాడ్, ఆరెపెల్లి, ఇరుకుల్ల, మందులపల్లి, చేగుర్తి, బొమ్మకల్ గ్రామాల్లోకి రేషన్ బియ్యం రాలేదని డీలర్లు వాపోతున్నారు. అయితే కరీంనగర్ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలో ఆఫీసర్ అనుకూలంగా ఉన్న అర్బన్ మండల డీలర్లకు బియ్యం పంపుతూ మిగతా రేషన్ షాపులకు సరఫరాలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉదయం 9గంటలకు వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గోదాం వద్ద నిరీక్షిస్తున్నామని బియ్యం లేవని చెప్పడంతో తిరిగి వస్తున్నామని చెబుతున్నారు. మండలంలో రేషన్ దుకాణాలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఒకే సారి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లు, లబ్ధిదారులు కోరుతున్నారు.

పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. బుధవారం నగరంలోని 34వ డివిజన్ గోదాం గడ్డలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగరంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా జవాన్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఎక్కడా చెత్తకనిపించకుండా వెంటవెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛ ఆటో వెళ్లేలా చూడాలన్నారు.



పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

గోదాంగడ్డ ప్రాంతంలోని హనుమాన్ దేవాలయం గోడ శిథిలమవడంతో కొత్త గోడను, డ్రైనేజీ కల్వర్టును నిర్మించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏడీఈ రఘు తెలిపారు. రేకుర్తి, సీతారాంపూర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలి

శంకరపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్, కాచాపూర్‌కు బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని హుజూరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆర్ఎం ఆదేశాలతో కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి బస్సు రూట్‌ను పరిశీలించారు. రెండు గ్రామాలకు బస్సు సౌకర్యం పునరుద్ధరించి విద్యార్థులు, ప్రయాణీకుల సమస్యలు పరిష్కరించాలని వారికి తెలుపగా పునరుద్ధరించేందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎంపీటీసీ స్థానాలకు దరఖాస్తుల వెల్లువ

- కాంగ్రెస్ టికెట్ కోసం హోరాహోరీ
- ఆశావహులు అనేకం

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీలో ఎంపీటీసీ స్థానాలకు దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది. ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగానే కార్యాలయానికి వచ్చి కార్యకర్తలు, ఇతరులు కూడా తమకు పార్టీ తరఫున పోటీచేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల వారీగా దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ చేపట్టగా అనూహ్య స్పంద లభించింది, ఒక్క కాట్నపల్లి మినహా అన్ని ఎంపీటీసీ స్థానాలకు అనేక దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తు ప్రక్రియ ముగియగానే మండల ఎన్నికల కమిటీ సభ్యుల నిర్ణయం ప్రకారం అర్హులైన అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు జరుగుతుందని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు నాయకులు చెబుతున్నారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా చాకుంటకు అత్యధికంగా 9 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాట్నపల్లి ఎంపీటీసీ స్థానానికి 1, రుక్మాపూర్ 4, చాకుంట 9, కొలిమికుంట 4, గుమ్లాపూర్ 2, వెదురుగట్టు 5, భూపాలపట్నం 5, ఆర్నకొండ 3, రాగంపేట 5, దేశాయిపేట 4, చిట్యాలపల్లి ఎంపీటీసీ స్థానానికి 3 దరఖాస్తులు వచ్చాయి.

వీణవంక: మండల పరిషత్ జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీవో మెరుగు శ్రీధర్ తెలిపారు. ఈ నెల 9నుంచి 11 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యలయం మొదటి అంతస్తులో 14 ఎంపీటీసీ స్థానాలకు నాలుగు క్లస్టర్లుగా కౌంటర్లు ఏర్పాటు చేశామని, గ్రౌండ్ ఫ్లోరులో జిల్లాప్రాదేశిక నియోజిక వర్గాలకు నామినేషన్‌లు ఆర్వోఆర్‌లు స్వీకరిస్తారని తెలిపారు. పోటీ చేసేవారు ఓటరు జాబితా ప్రకారం సరైన ధ్రువ పత్రాలతో ఆర్వోఆర్‌లకు అందజేయలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు త ఎలిపారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్‌ఎల్‌యూ) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాలస్తీనా ఐక్యత కార్యక్రమంలో దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని మంకమ్మతోటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దాడికి ఏబీవీపీ కార్యకర్తలు నాయకత్వం వహించారని ఆరోపించారు. దాడి చేసిన వారిని వదిలేసి విద్యార్థులను అరెస్టు చేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

శంకరపట్నంలో కోర్టు ఏర్పాటు చేయాలి

శంకరపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, హుజూరాబాద్ సబ్ కోర్టు న్యాయమూర్తులకు శంకరపట్నం మండల న్యాయవాదులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకరపట్నం మండల ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజా సమస్యలు పరిష్కరించుకోవడానికి కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు బొంగోని



వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

హరికృష్ణగౌడ్, కనకం దేవయ్య, మాతంగి సురేష్, నాస్మిన్ షబానా, బక్కి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లిలో ఎన్నికల సమావేశం

రామడుగు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెంకట్రావుపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించింది. అనంతరం గ్రామంతోపాటు గ్రామ పరిధిలోని కిష్టంపల్లిలో మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా మండల నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన యజ్ఞ వరాహక్షేత్రం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహస్వామిక్షేత్రం 39వవార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. క్షేత్రనిర్మాత, ఆధ్యాత్మి కవేత్త, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి గురువు ఆశీస్సు లతో 10నుంచి 15వ తేదీ వరకు తిరుమలలో మాదిరి ఉత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.



ముస్తాబైన దేవాలయం

రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థిని

భగత్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థిని ఎంపికైంది. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.సహస్ర జగిత్యాల జిల్లాలో నిర్వహించిన అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు. త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

మహిళా బ్లూకోల్ట్స్ ఏర్పాటు



మహిళా బ్లూకోల్ట్స్ వాహనం ప్రారంభిస్తున్న ఎస్సై

సైదాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో మహిళల రక్షణకు మహిళా బ్లూకోట్ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. బుధవారం ఆయన సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా బ్లూకోట్ పోలీస్ వేహికిల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళా బ్లూకోట్ సిబ్బంది ఎప్పుడు మండలంలో తిరుగుతూ మహిళలకు రక్షణగా ఉంటారన్నారు. మహిళలు, బాలికల పట్ల ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తించిన, కించపరినట్లు మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

భగత్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు జాడి బాల్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం నిధులు ఇచ్చినా పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏ గ్రామంలోనూ అభివృద్ధి చేపట్టలేదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి ఇంత వరకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. జరగబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తారన్నారు.

● సన్నాహక సమావేశం

రామడుగు : మండలంలోని షానగర్ ఎంపీటీసీ పరిధిలోని పందికుంటపల్లి, కుర్మపల్లి, కిష్టాపూర్‌లో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ యాదవ్, పూరెళ్ల శ్రీకాంత్ గౌడ్, సంటి జితేందర్, మాదం ఎల్లయ్య పాల్గొన్నారు.

సమాచారం పొందడం ప్రతీ పౌరుడి హక్కు

హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాచారం పొందడం ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని తహసీల్దార్ కనకయ్య అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ గూడూరు స్వామిరెడ్డి అధ్యక్షతన సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20సంవత్సరాలు పూర్తయిన సందర్భం గా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కనకయ్య మాట్లాడు తూ పౌరులు అడిగిన సమాచారాన్ని 30రోజుల్లో ఇవ్వడంలో విఫలమైతే సంబంధిత అధికారులు రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్‌కు బాధ్యులవుతారన్నారు. సమాచార



మాట్లాడుతున్న తహసీల్దార్ కనకయ్య

హక్కు చట్టం 2005 సంవత్స రంలో అమల్లోకి వచ్చిందన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు రమేష్, నవీన్‌కుమార్, స్వప్న, ముత్యంరెడ్డి, అనిల్‌కుమార్, రాజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల చేయాలి

హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): బెస్ట్ అవైలబుల్ పాఠశా లల్లో చదువుతున్న విద్యార్థుల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయా లని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖాధికారికి బుధవారం తల్లిదండ్రులు వినతి పత్రం సమర్పించారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు విడుదల చేయక పోవడంతో విద్యార్థులను పాఠశాలలకు తీసుకోవడం లేదన్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి పొన్నం బహిరంగ క్షమాపణ చెప్పాలి

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు వడ్లూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కడారి గంగరాజులు డిమాండ్ చేశారు. బుధవారం చొప్పదండిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు కొత్తూరు మహేష్, తోడేటి రత్నం, ఎనగందుల రాజయ్య, కడారి రాజలింగం, మాచర్ల ఓదయ్య, కొలపురి ప్రభాకర్, కొత్తూరి నరేందర్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళిత కులానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌నుతోటి మంత్రి అయినా లెక్క చేయకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ చులకనగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం శ్రీనివాస్, ఆర్ రామచంద్రం రవీందర్, వెంకటస్వామి, సాగర్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రామడుగు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రామడుగు మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు కొత్తూరి రాజన్నే, తడగొండ శంకర్, మర్రి కుమార్, కనకం నరేష్, శనిగరపు హన్మయ్య, గుడిసె విజయ్, దుబ్బాసి అంజయ్య, కొత్తూరి బాబు, శనిగారపు శంకర్, జుట్టు శంకర్ పాల్గొన్నారు.

జమ్మికుంట: మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను కావాలనే కొంత మంది వక్రీకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మంచి స్నేహితులని తెలిపారు. వారిద్దరు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక వ్యక్తులు అన్నారు. కుల, వర్గాలకు వ్యతిరేకంగా మాట్లాడు వ్యక్తి పొన్నం ప్రభాకర్ కాదన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీల నాయకుల ఎదుగుదల ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బురద జల్లుతున్నారని ఆరోపించారు.

సైదాపూర్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసనగా సైదాపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అజయ్, శ్రీనివాస్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

సద్దుమణిగిన వివాదం

(5వ పేజీ తరువాయి)

కుమార్ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ పరిణామంతో ఆయన కూడా జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక గ్రూపు ఏర్పాటు చేసుకోవడానికి అవ కాశం కలిగింది. ఇద్దరు మంత్రులు ఒక వైపు, ఇటు మంత్రి పొన్నం మరోవైపు గ్రూపులుగా విడిపో వడంతో జిల్లాలోని ద్వితీయశ్రేణి నాయకులు ఎవరి వద్దకు వెళితే ఏమి జరుగుతుందో అనే ఆందోళనలో ఉన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు చెందిన వారే ఉన్నారు. జిల్లాకు చెందిన వారెవరు మంత్రిగా లేరు. ఇతర జిల్లాలకు చెందిన మంత్రులు కరీంనగర్ జిల్లా ను కేంద్రంగా చేసుకొని రాజకీయాలు చేస్తుండడంతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతున్నదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇది ప్రభావం చూపే అవకాశమున్నదని ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయుడు మురళి నాయక్‌కు డాక్టరేట్

గణేశ్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు మాలోతూ మురళి నాయక్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ వారు డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. యూనివర్సిటీ డీన్ కేఎంఎం స్వామి ఢిల్లీలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాలోతూ మురళి నాయక్ మాట్లా డుతూ ఉపాధ్యాయ వృత్తిలో 28 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాభివృద్ధికి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి చేసిన సేవలను గుర్తించి అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారులకు సన్మానం



అధికారులు, ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్ఈ రమేష్ బాబు

గణేశ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, అధికారులకు టీజీ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ ఎస్ రమేష్‌బాబు సన్మానించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కంపెనీ స్థాయిలో కరీంనగర్ సర్కిల్‌లో ఎస్ఈ రమేష్ బాబు, కరీంనగర్ టౌన్ డివిజన్ స్థాయిలో జంపాల రాజంకు రెండో ర్యాంక్, సబ్‌డివిజన్ ఏడీ ఆపరేషన్ టౌన్‌పంజాల శ్రీనివాస్ గౌడ్‌కు మొదటి ర్యాంక్, సబ్ డివిజన్ టౌన్-2ఏఎం లావణ్యకు 5వర్యాంకు, కంపెనీ స్థాయిలో ఏఈ ఆపరేషన్ టౌన్-3 వెంకటరమణయ్యకు ఐదో ర్యాంకు వచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ సర్కిల్‌లో పి. శ్రీనివాస్ ఏడీ ఆపరేషన్ హుజురాబాద్, ఫసి అహ్మద్ ఏఈ ఆపరేషన్ టౌన్ 8కు మొదటి ర్యాం కులు వచ్చాయి. డీఈ లు ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి, చంద్రమౌళి, తిరుపతి పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కరాటే క్రీడాకారులు అన్వర్‌ఖాన్, అర్మాన్ ఖాన్, ఫర్హాన్ ఖాన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, బుద్ధి ధర్మ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌ను సాధించారు. తమిళనాడులోని చెన్నైలో నిర్వహించిన ఈ రికార్డ్‌లో సత్తాచాటారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సంస్థ ప్రతినిధులు పతకాలను, టీషర్టులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారని ఇంటర్నేషనల్ గోజిరాయి కరాటే అకాడమీ గ్రాండ్ మాస్టర్ అక్బర్ ఖాన్ తెలిపారు. క్రీడాకారులను కరాటే మాస్టర్ చరణ్, పి.జయేందర్, దర్శిత్ సంజీవ్ సింగ్, ఫహమిద ఖాతూన్, సమీనా జవేరియా, అయుబ్‌ఖాన్, అహ్మద్ ఖాన్, అఖిల్, అస్సాన్ ఉల్లా తదితరులు అభినందించారు.



సర్టిఫికెట్లతో జిల్లా క్రీడాకారులు

భక్తిశ్రద్ధల మధ్య చండీయాగం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలోని పోచమ్మ తల్లి దేవత ప్రతిష్ఠాన పంచమ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీయాగం, కుంకుమ పూజ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు భాస్కర్, మణికంఠ, పృథ్వీరాజ్‌లు చండీయాగం, కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళల నృత్యాల మధ్య పోచమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పురవీధుల గుండా తిప్పగా గ్రామ మహిళలు మంగళహారతులతో ఘన స్వాగ తం పలికారు. అనంతరం సిర్సపల్లి భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలతో తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

భగత్‌నగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ వ్యక్తిగత సేవ దినోత్సవం సందర్భంగా రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ సభ్యులు పలు కార్యక్రమాలు చేపట్టారు. కొత్తయాష్ వాడలోని ప్రాథమిక పాఠశాలలో లైన్ లేడీ బొంగోని భాగ్య లైన్ పర్శరాములు దంపతులు మూడు, నాలుగు, ఐదు, తరగతుల విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయిని సంధ్యారాణి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

గంగాధర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చే యాలని ఎంపీడీవో రాము అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీవో సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలుపై కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గౌరీ రమేష్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయం నిర్మించాలి

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని టీటీడీ కల్యాణ మండలపంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా శివారెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ హిమాయత్ నగర్ చైర్మన్ వేమూరి శంకర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఆత్మీయ సన్మానం

శంకరపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ ఉన్నత పాఠశాలలో ఇటీవల మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు స్వీకరించిన ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ, తెలుగు ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మిలను ఉపాధ్యా యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను హాజరై మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల మౌలిక వసతుల కల్పనలో వారి సేవలను కొనియాడారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎన్.సత్యనారాయణ సొంత ఖర్చులతో 104 మంది విద్యార్థులకు ఉచితంగా 40వేల విలువైన క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారంగా క్రీడా దుస్తులు అందజేశాన న్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణాకర్, ఆప్ కమిటీ చైర్ పర్సన్ ఉమా శ్రీ తపస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతి రావు, తపస్ కరీంనగర్ గ్రామీణ మండల శాఖ అధ్యక్షులు బుర్ర నాగరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమాదేవి విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.